సాక్షి
రంగారెడ్డి
గురువారం । 2 । నవంబర్ । 2023



సంచలనాల 'కల్వకుర్తి'

కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రతీ ఎన్నిక విలక్షణ తీర్పునిస్తుంది. రాష్ట్రానికి, దేశానికి రాజకీయ ఉద్దండులను అందించింది. 10లో▸



కాంగ్రెస్ కోసం కలిసి ..

మీ ఆశీర్వాదం ఉండాలని పట్నం కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ లక్ష్మీపతిగౌడ్‌ను కోరారు. 10లో▸



న్యూస్‌రీల్

5న ఆమనగల్లులో కేటీఆర్ సభ



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: పట్టణంలో ఈనెల 5న జరిగే ఎన్నికల ప్రచార సభలో మంత్రి, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొంటారని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వెల్లడించారు. సభ కోసం పట్టణంలోని కాలేజీ గ్రౌండ్స్‌ను బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ విజ యం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేటీఆర్ సభకోసం 50 వేలమంది జనసమీకరణ చేపడతామని అన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున చేరికలు ఉంటాయని చెప్పారు. ఈనెల 3వ వారంలో కల్వకుర్తిలో జరిగే ఎన్నికల సభలో సీఎం కేసీఆర్ పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ తోట గిరియాదవ్, వైస్‌ఎంపీపీ అనంతరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పానుగోటి అర్జున్‌రావ్, పట్టణ అధ్యక్షుడు పత్యానాయక్, ఎంపీటీసీ దోనాదుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు అమ్ముకోవద్దు

షాబాద్: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓటు అమ్ముకోవద్దు అంటూ ప్రజలను చైతన్యం చేసే పోస్టింగ్‌లు జోరుగా ట్రోల్ అవుతున్నాయి. సంతలో గేదె, ఎద్దు, మేక, పంది, కుక్కలకు ఉన్న విలువ మనిషి ఓటుకు లేదని కేవలం రూ.500 నుంచి రూ.5వేలకు ఓటు అమ్మినా దాని విలువ చాలా తక్కువ అని వివరంగా చెబుతూ చిత్రాలను ముద్రించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారు. కొంద రైతే తమ ఓటు అమ్ముకోవడం లేదని తమ వారికి ఉచిత విద్య, వైద్యం, ఆర్థికంగా తాము స్థిరపడటానికి అవసరమైన ప్రోత్సాహం కావాలని అని పోస్టు చేస్తున్నారు. ఎవరు చేసినా ప్రజలను చైతన్యవంతులను చేసే విధంగా పోస్టింగ్‌ల ఉండటం విశేషం. మరి ప్రజలు ఎలా వ్యవహరిస్తారో ఎలాంటి తీర్పు ఇస్తారో వేచి చూడాల్సి ఉంది.

నిర్భయంగా ఓటు వేయండి

మహేశ్వరం ఏసీపీ శ్రీనివాస్



దెబ్బడగూడలో అవగాహన కల్పిస్తున్న ఏసీపీ తదితరులు

కందుకూరు: ఓటు వజ్రాయుధం లాంటిదని.. అందరూ తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని మహేశ్వరం ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. మండల పరిధిలోని దెబ్బడగూడ, కందుకూరు, కందుకూరు చౌరస్తాల్లో బుధవారం సాయంత్రం పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ఇష్టమైన వారికి ఓటు వేసేలా పోలీసులు శాంతిభద్రతలను పరిరక్షిస్తారన్నారు. ఎలాంటి భయాలు లేకుండా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి నిరభ్యంతరంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఏవైనా ఇబ్బందులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రజల రక్షణ కోసం పోలీసులు 24 గంటలు పని చేస్తారన్నారు. కార్యక్రమంలో సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు

పహాడీషరీఫ్: ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతి లేకుండా సమావేశం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ నాయకులపై బాలాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాహీన్‌నగర్‌లోని ప్యారడైజ్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఇందుకు సంబంధించి ఆర్వో నుంచి ఎలాంటి అనుమతులు లేని కారణంగా ఫ్లైయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి పరిమళ ఫిర్యాదు మేరకు బాధ్యులైన అహ్మద్ బామ్, వసీం షా, అజీజ్ మహరాజ్, చల్లా నర్సింహారెడ్డి, ఏనుగు జంగారెడ్డితో పాటు మరికొందరిపై ఎంసీసీ ఉల్లంఘన కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఏ పార్టీ వారైనా సమావేశాలు, ప్రచార రథాలకు 48 గంటల ముందుగా ఆర్వో వద్ద అనుమతి తీసుకోవాలని.. లేదంటే కేసులు తప్పవని హెచ్చరించారు.

కాంగ్రెస్.. ఫుల్ జోష్

రాహుల్ విజయభేరి యాత్ర సక్సెస్

- భారీగా తరలివచ్చిన జనం
- కిక్కిరిసిన షాద్‌నగర్ చౌరస్తా
- పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం

షాద్‌నగర్/ షాద్‌నగర్ రూరల్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన విజయభేరి బస్సుయాత్ర విజయవంతమైంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా షాద్‌నగర్‌కు విచ్చేసిన రాహుల్‌కు జనం బ్రహ్మరథం పట్టారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో వివిధ మండలాల నుంచి జనం భారీగా తరలి రావడంతో చౌరస్తాలో ఉన్న నాలుగు రోడ్లు జనంతో పూర్తిగా నిండిపోయాయి. ఎన్నికల వేళ రాహుల్ రాకతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం కనిపించింది.

వీర్లపల్లి శంకర్‌కో జితాఓ

షాద్‌నగర్ కాంగ్రెస్ పార్టీ కా అభ్యర్థి వీర్లపల్లి శంకర్ హై.. ఏ చునావ్‌మే శంకర్‌కో జితాఓ (గెలిపించాలి) అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రజలను కోరారు. పట్టణ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో రాహుల్‌తో పాటు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నిరుపేదలకు అండగా నిలుస్తుందని అన్నారు. కర్ణాటకలో ఎన్నికల హామీలను ఏవిధంగా అయితే అమలు చేస్తున్నామో తెలంగాణలోనూ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. నిత్యం ప్రజల్లో ఉండే వీర్లపల్లి శంకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



చౌరస్తాలో పోలీసుల బందోబస్తు



షాద్‌నగర్ విజయభేరి యాత్రకు తరలివచ్చిన జనం, (ఇన్‌సెట్) ప్రజలకు అభివాదం చేస్తున్న రాహుల్‌గాంధీ

భారీ బందోబస్తు

సభకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వస్తున్న సందర్భంగా ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో పట్టణ సీఐ ప్రతాప్‌లింగం ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బైపాస్ ముఖ్యకూడలితో పాటు సభా స్థలి వద్ద ప్రత్యేక బలగాలతో భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ బందోబస్తులో ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, నలుగురు ఏసీపీలు, ఎనిమిది మంది సీఐలు, 20 మంది ఎస్‌ఐలతో పాటు సుమారు 300 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఏసీపీ రంగస్వామి పట్టణ సీఐ ప్రతాప్‌లింగంతో కలిసి బందోబస్తును పర్యవేక్షించారు.

సైడ్‌లైట్స్

- మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో విజయభేరి బస్సు యాత్రను ముగించుకొని సాయంత్రం 6.30 గంటలకు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ షాద్‌నగర్ శివారులోని కేశంపేట బైపాస్‌కు చేరుకున్నారు.
- పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాంసుందర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు వెంకట్‌రాంరెడ్డి, తాండ్ర విశాల ఆధ్వర్యంలో నేతలు రాహుల్ గాంధీకి ఘన స్వాగతం పలికారు.
- అక్కడి నుంచి స్థానిక నేతలతో కలిసి రాహుల్ గాంధీ నడుచుకుంటూ పట్టణ ముఖ్య కూడలికి రాత్రి 7 గంటలకు చేరుకున్నారు.
- రాత్రి 7.30 వరకు రాహుల్ తన ప్రసంగం కొనసాగించారు.
- రాహుల్‌గాంధీ హిందీలో ప్రసంగించగా భట్టి విక్రమార్క తెలుగులోకి అనువదించారు.
- మధ్యలో 7.15 నుంచి 7.17 గంటల వరకు మసీద్‌లో ప్రార్థనలు ప్రారంభం కావడంతో రాహుల్ తన ప్రసంగాన్ని రెండు నిమిషాలు ఆపివేశారు.
- ముఖ్యకూడలిలో కళాకారుల ఆటా పాటలు అలరించాయి.
- బుగ్గారెడ్డి కాంప్లెక్స్‌పై ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ తెర చూపరులను ఆకట్టుకుంది.
- రాత్రి 7.30 గంటలకు ప్రసంగం ముగియడంతో రాహుల్ శంషాబాద్ వెళ్లారు.

అండగా నిలబడండి

- మంత్రి సబితారెడ్డి

తుక్కుగూడ: మహిళలు సాటి మహిళనైన తనకు అండగా ఉండి ఈ ఎన్నికలో ఆశీర్వదించాలని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. తుక్కుగూడలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మహిళ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.1000 ఉన్న గ్యాస్ ధరను రూ.400కు ఇస్తామన్నారు. దీంతో పాటు ఆసరా పింఛన్లు పెంచుతామన్నారు. ఇప్పటికే నియోజకవర్గాన్ని రూ.వేల కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని ఇమామ్‌గూడ గ్రామానికి చెందిన బంటు రమేష్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్, వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు పద్మ, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మీర్‌పేట ఆర్‌ఆర్ హోమ్స్‌లో కాలనీవాసుల సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

మరోసారి ఆశీర్వదించండి

మీర్‌పేట: మీర్‌పేట, బడంగ్‌పేట జంట కార్పొరేషన్లలో రూ.832 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు మంత్రి సబితారెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రాత్రి మీర్‌పేట కార్పొరేషన్ పరిధి 18వ డివిజన్ ఆర్‌ఆర్‌హోమ్స్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో కాలనీవాసులతో సమావేశమయ్యారు. ప్రత్యేక ప్రణాళికతో నియోజకవర్గంలోని కాలనీల్లో అభివృద్ధి చేపట్టామని, మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు అర్కల భూపాల్‌రెడ్డి, సిద్దాల లావణ్య పాల్గొన్నారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం


అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి

చేవెళ్ల: ఎన్నికల కోడ్ నేపథ్యంలో అక్రమ మద్యం, రిసార్టులు, ఫాంహౌస్‌ల్లో జరిగే మందు పార్టీలపై ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయటంతో పాటు అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపుతుందని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్ మండలాల్లో అక్రమ మద్యంపై ప్రత్యేకంగా దృష్టిసారించి తనిఖీలు చేపట్టినట్టు తెలిపారు. ఇందులో భాగంగా రెండు రోజులుగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళి ప్రకారం బయట రాష్ట్రాల నుంచే వచ్చే అక్రమ మద్యంపై రైల్వే స్టేషన్స్, జాతీయ రహదారులపై విస్తృత తనఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అక్రమంగా మద్యం నిల్వ, రవాణా చేయడం నేరమని.. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చేవెళ్ల సర్కిల్ పరిధిలో పలు దఫాలుగా నిర్వహించిన తనిఖీల్లో రూ.81,52,783 విలువ చేసే 16,238 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దీంతో పాటు 18 మందిపై కేసులు నమోదు చేసి ఒక వాహనం సీజ్ చేసి ఆరుగురిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు సమయ పాలన పాటించాలని లేకపోతే చర్యలు ఉంటాయన్నారు. గ్రామాల్లో బెల్టుషాపులపై ప్రత్యేక తనిఖీలు చేస్తున్నామని ఎక్కడైన అమ్మినట్లు తెలిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల్లో చేవెళ్ల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీలత, ఎస్‌ఐలు ఎంవీ ప్రసన్నరెడ్డి, ఎస్. శ్రీనివాస్, ఎ.నర్సింహా, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి

ఇస్మార్ట్ లీడర్స్!



- ఓటర్లకు ఫోన్ కాల్స్, వాయిస్ మెసేజ్‌లు
- మేనిఫెస్టోను వివరిస్తూ ఓటు వేయాలని అభ్యర్థన
- కాల్ సెంటర్లతో అభ్యర్థుల ఒప్పందం

సాక్షి, సిటీబ్యూరో: స్మార్ట్‌ఫోన్ల యుగంలో ఎన్నికల ప్రచారం కొత్త పుంతలు తొక్కుతుంది. ఎన్నికలేవైనా కామన్‌గా జరిగే ఇంటింటి ప్రచారం కాస్త ఇప్పుడు నెట్టింటి ప్రచారంగా మారిపోయింది. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలకు నెల రోజుల గడువు మాత్రమే ఉండటంతో వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ప్రచారం జోరు పెంచారు. తక్కువ సమయంలో ఎక్కువ మంది ఓటర్లకు చేరుకునేందుకు స్మార్ట్ బాటపట్టారు. ఓటర్లకు నేరుగా ఫోన్లు, వాయిస్ మెసేజ్‌లు పంపిస్తూ ప్రచారం చేస్తున్నారు. ఇందుకోసం కాల్ సెంటర్లతో అభ్యర్థులు ఒప్పందం చేసుకుంటున్నారు.

యువతకు ఉపాధి మార్గం..

ఈ తరహా వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. హిందీ, ఇంగ్లిష్, తెలుగు స్పష్టంగా మాట్లాడే మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులను తాత్కాలిక ప్రాతిపదికన కాల్ సెంటర్లు, ఏజెన్సీలు నియమించుకుంటున్నాయి. ఇంగ్లిష్ వచ్చిన వారికి అధిక ప్రాధాన్యమిస్తున్నాయి. రోజు లెక్కన, కాల్స్ వారీగా జీతభత్యాలను అందిస్తున్నాయి. ఒక్కో కాల్ సెంటర్ అవసరాన్ని బట్టి రూ.50–100 మందిని నియమించుకుటున్నాయి.

మీ ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది?

కాల్ సెంటర్ల నిర్వాహకులు అధికార, ప్రతిపక్షాల అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్నారు. ఆన్‌లైన్, ఇతరత్రా మాధ్యమాల ద్వారా ఓటర్ల పేరు, ఫోన్ నంబర్లు తదితర వివరాలను కాల్ సెంటర్లు సేకరిస్తున్నాయి. నియోజకవర్గంలోని ఓటర్ల సమగ్ర సమాచారంతో సేవలను అందిస్తున్నాయి. దీని పరిధిలో ప్రత్యేకంగా క్యాంపులను ఏర్పాటు చేసుకుంటున్నాయి. అధికార పార్టీ అభ్యర్థులు కస్టమర్లయితే సంక్షేమ పథకాల గురించి వివరించి సదరు అభ్యర్థికే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ప్రతిపక్ష, ఇతర అభ్యర్థులైతే మేనిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఓటర్లకు ఫోన్ చేసి మీ నియోజకవర్గంలో అభివృద్ధి ఎలా ఉంది? స్థానిక సమస్యలను పరిష్కరించడంలో ఎవరు ముందుంటారు? ప్రస్తుత ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది? ఈసారి మీ ఓట్లు ఎవరికి? అంటూ అడుగుతున్నారు.

నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి

అబిడ్స్: ఈ నెల 3 నుంచి అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియకు దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. బుధవారం అబిడ్స్ మున్సిపల్ కాంప్లెక్స్‌లోని గోషామహల్ నియోజకవర్గ రిటర్నింగ్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా, శాంతియుతంగా జరిగేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఓటింగ్ శాతాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతిరోజు గోషామహల్‌తో పాటు అన్ని ఆర్‌ఓ కార్యాలయాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. నామినేషన్ల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టేందుకు సీసీ కెమెరాలతో పాటు వీడియో కెమెరాలతో చిత్రీకరిస్తున్నామన్నారు. ఆర్‌ఓ కార్యాలయం బయట, లోపల కూడా సమయ నిబంధనల కోసం ఎలక్ట్రానిక్ వాచ్‌లను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల్లో పాల్గొనే సిబ్బంది కోసం పోలింగ్ బ్యాలెట్ పేపర్లను పంపిణీ చేస్తున్న తెలిపారు. పోలింగ్‌స్టేషన్లు రెండు కిలోమీటర్ల లోపు స్థానికులకు ఉండే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఓ విక్టర్, ఏఆర్‌ఓలు మన్నె ప్రేమ్‌కుమార్, సయ్యద్ సైదుద్దీన్, శైలజ పాల్గొన్నారు.



అబిడ్స్ మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

సొంత గూటికి రామ్మోహన్ గౌడ్ దంపతులు

- బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి హరీశ్‌రావు

ఎల్‌బీనగర్: కేసీఆర్ అంటే రామ్మోహన్ గౌడ్‌కు ఎనలేని ప్రేమ. అందుకే తిరిగి బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన ఆయనకు సముచిత స్థానం కల్పిస్తామని మంత్రి హరీష్‌రావు అన్నారు. బుధవారం బీఎన్‌రెడ్డి నగర్‌లోని రామ్మోహన్ గౌడ్ నివాసంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ గౌడ్ దంపతులను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించి పార్టీ కండువా కప్పారు. గత నెల 12న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన రామ్మోహన్ గౌడ్ దంపతులు బుధవారం తిరిగి సొంత గూటికి చేరుకున్న సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. 2026లో నియోజకవర్గాల పునర్విభజన జరగనుందని, ఎల్‌బీనగర్ నియోజకవర్గం రెండు లేదా మూడు నియోజవర్గాలుగా ఏర్పడుతుందని తెలిపారు. గతంలో రెండుసార్లు ఇక్కడి నుంచి పోటీ చేసి స్వల్ప మెజార్టీతో ఓటమి చెందారని, పెద్ద మనసుతో తిరిగి పార్టీలోకి వచ్చినందుకు రామ్మోహన్ గౌడ్‌ను ఆయన అభినందించారు. కాంగ్రెస్ అంటేనే గెలిచేదే లేదని, పార్టీ హై కమాండ్ ఢిల్లీలో ఉంటుందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ పార్టీయేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రామ్మోహన్‌గౌడ్‌కు కాంగ్రెస్ టికెట్ ఇస్తామని ఆశ చూపి పార్టీలో చేర్పించుకున్నారని, అనంతరం మొండి చేయి చూపించారని అన్నారు.



బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

కాంగ్రెస్ కోసం కలిసి నడుద్దాం


లక్ష్మీపతిగౌడ్‌తో మల్‌రెడ్డి రంగారెడ్డి, పార్టీ నాయకులు

లక్ష్మీపతిగౌడ్ మద్దతు కోరిన మల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: అన్నా.. నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరాలంటే మీ ఆశీర్వాదం ఉండాలని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ లక్ష్మీపతిగౌడ్‌ను కోరారు. బుధవారం ఆయన ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీ పటేల్‌గూడలోని లక్ష్మీపతిగౌడ్ నివాసానికి చేరుకుని ఆయన మద్దతు కోరారు. 38 ఏళ్ల కిందట ఎగిరిన జెండాకు పునరుజ్జీవం పోద్దామన్నారు. ఇందుకు ఆయన సుముఖత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మహిపాల్, పీసీసీ ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మున్సిపల్ అధ్యక్షుడు బాలరాజుగౌడ్, ధన్‌రాజ్‌గౌడ్ తదితరులున్నారు.

కాంగ్రెస్ వినూత్న నిరసన

ముషీరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్స్ ఇటీవల కుంగిపోవడంతో అందులో భారీస్థాయిలో అవినీతి జరిగిందనేది చూపించేందుకు బుధవారం ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో ముషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ వినూత్న నిరసన చేపట్టారు. కాళేశ్వరం ఏటీఎం పేరుతో ఒక ఏటీఎంను తయారు చేసుకొచ్చి ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో పెట్టారు. దానిపై ఈ శతాబ్దపు భారీ కుంభకోణం అంటూ కేసీఆర్ నోటి నుంచి డబ్బులు వచ్చేలా ఈ ఏటీఎంను తయారు చేశారు. ఏటీఎంను అంజన్‌కుమార్ యాదవ్ సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు.



సంచలనాల 'కల్వకుర్తి'


లట్టుపల్లి వెంకట్‌రెడ్డి


ద్యాప గోపాల్‌రెడ్డి


చిత్తరంజన్‌దాస్


సూదిని జైపాల్‌రెడ్డి


ఎడ్మ కిష్టారెడ్డి


జైపాల్‌యాదవ్


వంశీచంద్‌రెడ్డి

కల్వకుర్తి నియోజకవర్గం.. కాకలు తీరిన రాజకీయ ఉద్దండులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్న గడ్డ. మహామహులనే మట్టి కరిపించిన నేల. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1989 ఎన్నికల్లో దివంగత ఎన్టీఆర్‌పై పోటీ చేసిన చిత్తరంజన్‌దాస్ గెలుపొంది సంచలనం సృష్టించారు. తదనంతరం కాంగ్రెస్ ఆయనకు మంత్రి వర్గంలో చోటు కల్పించింది. సూదిని జైపాల్‌రెడ్డిలాంటి గొప్ప నాయకులను అందించిన ఓటర్లు ఈ సెగ్మెంట్ సొంతం.

ఎన్టీఆర్‌ను ఓడించిన సెగ్మెంట్

- ఎన్నిక ఏదైనా తీర్పు విలక్షణం
- తొమ్మిదిసార్లు హస్తానికే అవకాశం
- అసెంబ్లీ మెట్లెక్కిన ముగ్గురు స్వతంత్రులు
- వరుసగా నాలుగు సార్లు గెలిచిన 'సూదిని'

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రతీ ఎన్నిక విలక్షణ తీర్పునిస్తుంది. రాష్ట్రానికి, దేశానికి రాజకీయ ఉద్దండులను అందించింది. ఎన్టీఆర్ లాంటి మహామహులను ఓడించి రాష్ట్ర రాజకీయ చరిత్రలో ప్రత్యేకతను సంపాదించుకుంది. ఇక్కడ ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో తొమ్మిదిసార్లు కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించగా.. జనతాదళ్, స్వతంత్ర అభ్యర్థులు మూడు సార్లు, రెండు సార్లు టీడీపీ నుంచి పోటీచేసిన వారు గెలుపొందారు. ఇక్కడ గెలుపొందిన వారిలో లట్టుపల్లి వెంకట్‌రెడ్డి, జె.చిత్తరంజన్‌దాస్‌లకు మాత్రమే అమాత్యులుగా అవకాశం లభించింది.

రెండు జిల్లాల పరిధిలో సెగ్మెంట్

1962లో కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటయింది. ఈ సెగ్మెంట్‌లో ఆరు మండలాలుండగా జిల్లాల పునర్విభజనలో రెండు జిల్లాల పరిధిలో ఉంది. వెల్దండ, చారకొండ, కల్వకుర్తి మండలాలు నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల, తలకొండపల్లి రంగారెడ్డి జిల్లాలో ఉన్నాయి.

17 పర్యాయాలు ఎన్నికలు

కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు ఉప ఎన్నికలతో సహా 17 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. 1952 నుంచి 62 వరకు ద్విసభ్య నియోజకవర్గంగా ఉన్నది. 1952 ఎన్నికల్లో జనరల్ నుంచి నర్సింగరావ్, ఎస్సీ రిజర్వ్ నుంచి వీరస్వామి, 1957 ఎన్నికలలో జనరల్ నుంచి శాంతాబాయి, ఎస్సీ రిజర్వ్ నుంచి నాగన్న విజయం సాధించారు.

జైపాల్‌కే జై

నియోజక వర్గం నుంచి వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది దివంగత మాజీ కేంద్ర మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి రికార్డుకెక్కారు. 1969లో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా జైపాల్‌రెడ్డి తొలిసారి విజయం సాధించారు. 1972లో కాంగ్రెస్ నుంచి, 1978, 1983లో జనతాదళ్ నుంచి జైపాల్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

ఇచ్చిన పార్టీకి.. తెచ్చిన పార్టీకి..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం జరిగిన రెండు ఎన్నికల్లో కాంగ్రెస్, టీఆర్‌ఎస్‌లకు చెరో విజయం అందించారు. 2014 ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, 2018 ఎన్నికలలో బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌లు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 2014 ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి ఆచారి కేవలం 72 ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు.

అభ్యర్థుల ఖరారు

ప్రస్తుత ఎన్నికలలో అన్ని ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారయ్యారు. బీఆర్‌ఎస్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మరోసారి పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, బీజేపీ అభ్యర్థిగా జాతీయ బీసీ కమీషన్ మాజీ సభ్యులు ఆచారి, బీఎస్పీ అభ్యర్థిగా కొమ్ము శ్రీనివాస్‌యాదవ్‌లు కల్వకుర్తి బరిలో ఉన్నారు.



గెలుపొందిన ఎమ్మెల్యేలు

సంవత్సరం	అభ్యర్థి	పార్టీ
1952	నర్సింగరావ్,వీరాస్వామి	కాంగ్రెస్
1957	శాంతాబాయి, నాగన్న	కాంగ్రెస్
1962	లట్టుపల్లి వెంకట్‌రెడ్డి	స్వతంత్ర
1964	శాంతాబాయి	కాంగ్రెస్
1967	ద్యాప గోపాల్‌రెడ్డి	స్వతంత్ర
1969	సూదిని జైపాల్‌రెడ్డి	కాంగ్రెస్
1972	సూదిని జైపాల్‌రెడ్డి	కాంగ్రెస్
1978	సూదిని జైపాల్‌రెడ్డి	జనతాపార్టీ
1983	సూదిని జైపాల్‌రెడ్డి	జనతాపార్టీ
1985	చిత్తరంజన్‌దాస్	కాంగ్రెస్
1989	చిత్తరంజన్‌దాస్	కాంగ్రెస్
1994	ఎడ్మ కిష్టారెడ్డి	స్వతంత్ర
1999	జైపాల్‌యాదవ్	టీడీపీ
2004	ఎడ్మ కిష్టారెడ్డి	కాంగ్రెస్
2009	జైపాల్‌యాదవ్	టీడీపీ
2014	చల్లా వంశీచంద్‌రెడ్డి	కాంగ్రెస్
2018	జైపాల్‌యాదవ్	టీఆర్‌ఎస్

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కడ్తాల	16576	15443	0	32019
తలకొండపల్లి	18016	17259	2	35277
కల్వకుర్తి రూరల్	15074	14672	0	29746
కల్వకుర్తి అర్బన్	11902	11864	0	23746
వెల్దండ	15978	5586	1	31565
చారకొండ	3394	3363	0	6757
ఆమనగల్లు	15065	14876	0	29941
మాడ్గుల	21388	20187	4	41579
మొత్తం	117397	113250	7	230650

స్వతంత్రులకు సై..

ఈ నియోజకవర్గం నుంచి ముగ్గురు స్వతంత్రులు విజయం సాధించారు. 1962 ఎన్నికలో తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన లట్టుపల్లి వెంకట్‌రెడ్డి, 1967లో మిడ్జిల్ మండలం గుడిగానిపల్లికి చెందిన ద్యాప గోపాల్‌రెడ్డి, 1994లో కల్వకుర్తికి చెందిన ఎడ్మ కిష్టారెడ్డి ఇండిపెండెంట్‌లుగా పోటీ చేసి సత్తాచాటుకున్నారు.

ఎన్టీఆర్‌కు చేదు అనుభవం

టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత మాజీ సీఎం ఎన్టీ రామారావుకు కల్వకుర్తి ఓటర్ల నుంచి చేదు అనుభవం ఎదురైంది. 1989 ఎన్నికల్లో కల్వకుర్తి నుంచి బరిలో ఉండగా కాంగ్రెస్ అభ్యర్థి జె.చిత్తరంజన్‌దాస్ చేతిలో ఓటమ పాలయ్యారు. అనంతరం ఆయనకు హస్తం పార్టీ మంత్రివర్గంలో చోటు కల్పించింది.

ఒకేసారి నాలుగు సెట్లు వేయొచ్చా?

నాంపల్లి: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి నాలుగు నామినేషన్ సెట్లను వేసుకోవచ్చు. అంతకు మించి నామినేషన్లను అధికారులు స్వీకరించరు. నోటిఫికేషన్ వెలువడిన రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసే రోజు వరకు వీటిని దాఖలు చేసుకోవచ్చు. అయితే నాలుగు సెట్లను ఒకేరోజు వేయడానికి వీలుండదు. నామినేషన్ ఎప్పుడు వేసినా రోజుకు ఒకటి చొప్పున మాత్రమే రిటర్నింగ్ అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. నామినేషన్ వేయదల్చుకున్న అభ్యర్థి ముందుగా రిటర్నింగ్ అధికారి వద్ద ఉండే రిజిస్టర్‌లో తన పేరును నమోదు చేసుకుని దరఖాస్తును తీసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు తీసుకున్న అభ్యర్థి అత్యధిక సెట్లు నామినేషన్ వేయదలిస్తే కావాల్సిన సెట్లను జిరాక్స్ తీసుకుని ఖాళీలను పూరించాల్సి ఉంటుంది. అలా పూరించిన దరఖాస్తుతో పాటుగా ఎన్నికల కమీషన్ నిర్దేశించిన డిపాజిట్ సొమ్మును అభ్యర్థి చెల్లించాల్సి ఉంటుంది. డిపాజిట్ జత చేయని దరఖాస్తును ఎట్టి పరిస్థితిలో ఆర్‌ఓ స్వీకరించరు. ఒకే డిపాజిట్ సొమ్ముతో నాలుగు సెట్లు నామినేషన్ పత్రాలను సమర్పించవచ్చు.

ఓటుపై అవగాహన ర్యాలీ



సాక్షి, సిటీబ్యూరో: ఎల్బీనగర్ ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ఆధ్వర్యంలో 'చైల్డ్ డెవలప్‌మెంట్ పెడగాగి' కార్యక్రమంలో భాగంగా ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌ఐ దయాకర్ విద్యార్థులకు ఓటుపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



● ఓటేద్దాం రండి

మణికొండ: ప్రజల భద్రతకు మేము ఉన్నామని, వారంతా నిర్భయంగా రాబోయే ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోవాలని మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం రాయదుర్గం పీఎస్ పరిధిలోని మణికొండ పంచవటీ కాలనీలో కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కును వినియోగించుకోవడం అందరి బాధ్యత అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఓటు అనేది ప్రతీ ఒక్కరికి ఆయుధమన్నారు. ఓటును వినియోగించుకుని ఉత్తమ నాయకులను ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పెద్దఎత్తున బలగాలతో తాము భద్రత కల్పిస్తామన్నారు.

వామ్మో రథశాల!

ఎన్నికలు వచ్చాయంటే నియోజకవర్గంలోని ఓ పురాతన కట్టడం వణికిస్తోంది. అక్కడికి వెళ్లాలంటేనే నేతలు జంకుతున్నారు. ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చింది మొదలు అభ్యర్థులు తమ సెంటిమెంట్‌లను తూచా తప్పక పాటిస్తుంటారు. ఇలాంటి ఓ విచిత్రమైన సెంటిమెంట్ షాద్‌నగర్ సెగ్మెంట్‌లో కనిపిస్తోంది. పట్టణంలోని పాత జాతీయ రహదారి సమీపంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదుట ఉన్న రథశాల పరిసరాల్లో ప్రచార కార్యక్రమాలు చేపట్టినా.. రథశాలపై వాల్‌రైటింగ్స్, పోస్టర్లు అంటించినా ఆ అభ్యర్థి ఓటమి ఖాయమనే ప్రచారం ఉంది. దీంతో రథశాల పరిసరాల్లో ఎటువంటి పొలిటికల్ వాతావరణం కనిపించదు. – షాద్‌నగర్


షాద్‌నగర్‌లోని రథశాల

IN THE COURT OF HON'BLE MOTOR ACCIDENTS CLAIM TRIBUNAL-CUM-PRINCIPAL DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR
M.V.O.P.No.323 OF 2023
BETWEEN:
KODURI POSHAIAH And others ... PETITIONERS
AND
MD.FAIZAM ANSARI And others ...RESPONDENTS
To
R-1 Md.Faizam Ansari, S/o Noor Ahmed Ansari,Aged about 25 years, Occ: Driver, R/o Thondupally Village, Shamshabad Mandal, Ranga Reddy District.
Please take notice that the above named Petitioners have filed the above M.V.O.P.No.323 of 2023 pending on the file of Hon'ble Principal District Judge, Ranga Reddy District at L.B.Nagar and the above case is posted on 10.11.2023 for your appearance and counter if any. If you fail to appear on 10.11.2023 at 10.30 am before the Hon'ble Court in person or through an Advocate, the matter will be decided as per law.
Hence, this Notice
(BY ORDER OF THE COURT)
Sd/- K.SADANANDAM, Advocates
H.No.16-11-418/3/2
Moosarambagh, Dilsukhnagar, Hyderabad - 36.
Phone: 9848504133

PUBLIC NOTICE

The Public in general is hereby informed that our client has entered into an Agreement of Sale with **Mamidi Indra Sena Reddy S/o. M Shiva Reddy**, in respect **Plot Bearing No. 109 admeasuring 222.22 Square Yards or equivalent to 185.77 Sq. Meters in Part of Survey No's.191, 192 and 199 situated at "PLESANT PART" Hyderguda Village, G.H.M.C., Rajendra Nagar Circle, Ranga Reddy District, Telangana,** and our client has also paid substantial amount as an advance towards part of sale consideration.

Any person(s) is/are having **any right, claim or interest/s or objection/s of whatsoever nature** in respect of the above said Plot or above said transaction shall intimate the undersigned in writing along with supporting documents within **(05) FIVE DAYS** from the date of this publication. Failing which our client will proceed further for purchase of the above said Plot and any objection raised thereafter will not be entertained.

Sd/- DMA - ADVOCATES
Damodar Mundra, Dinesh K. Gilda, G Venkatesh,
#102, KGN Plaza, Street No.8, Himayathnagar, Hyderabad.
Call: 9440404539
Email: Info@dmaadvocates.com

NOTICE
IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DIST. JUDGE. R.R. DIST. AT. LB NAGAR.
GW. OP.NO. 94 of 2023

Between:
1. Nallavolu Vishnuvardhan Reddy s/o. Linga Reddy, Aged 50 yrs, Business.
2. Nallavolu Srishanth Reddy, aged 16 yrs, occ: Student, being minor, rep. by his father and natural guardian Nallavolu Vishnuvardhan Reddy. both are r/o. H.No. 1025, Sangam village, Keshampet mandal, RR Dist. ... Petitioners

And

1. All Concerned
2. Nallavolu Srichanda d/o. N. Vishnuvardhan Reddy 21 yrs, student r/o 1025, Sangam (V), Keshampet mandal, RR Dist. ...Respondents

To:
All Concerned ...1st Respondent

Please take notice that the petitioners filed the above GWOP for appointment of the 1st Petitioner as guardian of the Person and properties of the minor 2nd Petitioner Nallavolu SriShanth reddy DOB is 22.10.2006 and also consequently seeking permission by 1st Petitioner to alienate undivided 1/3rd share of the minor Nallavolu Srishanth reddy in favour of prospective purchasers in respect of Property ie., All that Agrl. land in Sy.No. 12/A/1, to an extent of Ac. 02. 29 Gts situated at Sangam (V) and GP. Keshampet mandal, RR Dist. The above OP stands posted to 20.11.2023 If any person/s is having any objection in granting the said reliefs, may appear before the said court on the said date at 10.30 a.m. either in person or through your Advocate and submit your objections through documentary evidence. Failing which, the matter will be heard and decided exparte.

(By order of the court)
Sd/- K. Sanjeeva reddy, Advocate
Plot No. 35, Sundaram colony, Rukmini enclave, MachaBollarum, Secunderabad - 500010, TS. (Cell No. 9246524030)
RR Dist.
Dt. 01.11.2023 Counsel for petrs